క్లుప్తంగా

చోరీలతో అప్రమత్తమైన పోలీసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం: పట్టణంలో వరుస చోరీలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం కళ్యాణదుర్గం రింగ్ రోడ్డులోని అనంతపురం, కంబదూరు, రాయదుర్గం బైపాస్‌ల నుంచి కళ్యాణదుర్గంలోకి వచ్చే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డీఎస్పీ రవిబాబు ఆదేశాలతో పట్టణ సీఐ హరినాథ్ సిబ్బందితో ప్రత్యేక తనిఖీ చేపట్టారు. అనుమానితులుగా కనిపించిన వారి నుంచి పూర్తి వివరాలు సేకరించారు. చోరీలకు పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ హరినాథ్ తెలిపారు.

సీఈసీ సభ్యుడు ఉమాకు ఘన సన్మానం


ఉమాకు అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు మాదినేని ఉమా మహేశ్వరనాయుడుకు అభినందనల వెల్లువ వెల్లువెత్తుతోంది. శనివారం కళ్యాణదుర్గం, శెట్టూరు మండలాల నుంచి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కళ్యాణదుర్గంలోని ఉమా స్వగృహంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సన్మానించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరంధామరెడ్డి, జైపాల్‌రెడ్డి, సోము, తిమ్మరాయుడు, శ్రీధర్, రామ్మూర్తితో పాటు శెట్టూరు, భట్టువానిపల్లి, కొండాపురం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆలయ పునర్ నిర్మాణానికి విరాళం


నగదు అందజేస్తున్న సర్పంచు మల్లెల జగదీష్


వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలో గ్రామపెద్దల ఆధ్వర్యంలో పునర్ నిర్మిస్తున్న దర్గా వన్నురుస్వామి ఆలయానికి సర్పంచు మల్లెల జగదీష్ రూ.25,116 విరాళాన్ని శనివారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శివలింగప్ప., కర్రె ధనుంజయ ,గ్రామపెద్దలు నారాయణప్ప, మోహన్, సాకే పుల్లయ్య, మహిపతి, లాలుసాబ్, రామాంజినేయులు, భార్గవ్, దినేష్, తరుణ్, ఓబులేసు, క్రిష్ణకాంత్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ


పల్లకీ ని ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణం చుట్టూ డప్పు వాయిద్యాలు, మేళ తాళాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ లేక రోగులకు ఇబ్బంది


కూడేరు:పీహెచ్‌సీలో డాక్టర్ కుర్చీ ఖాళీగా ఉన్న దృశ్యం

కూడేరు: కూడేరు పీహెచ్‌సీలో శనివారం డాక్టర్ లేక రోగులు ఇబ్బంది పడ్డారు. చోళసముద్రం, ఇప్పేరు, ముద్దలాపురం, కొర్రకోడు, కమ్మూరు, అరవకూరు, కలగళ్ల, జల్లిపల్లి, ఉదిరిపికొండ, కరుట్లపల్లి, జయపురంతో పాటు మరికొన్ని గ్రామాల నుంచి వైద్యం కోసం సుమారు 80 మంది దాకా వచ్చారు. అయితే న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మె శనివారానికి 9వ రోజుకు చేరుకుంది. డాక్టర్ ఉషారాణి సమ్మెలోకి వెళ్లడం, మరో డాక్టర్ పోస్టు ఖాళీ ఉండడంతో వైద్యులు లేక రోగులకు ఖాళీ కుర్చీ దర్శనమిచ్చింది. దీంతో రోగులు అవస్థలు పడ్డారు. కొందరు స్టాఫ్ నర్సుతో వైద్యం చేయించుకున్నారు. కొందరు ఎక్కువ సేపు వేచి ఉండలేక వెనుదిరిగారు.

పట్టుకోండి చూద్దాం

- ఓ వైపు ఇళ్లు.. మరోవైపు గుళ్లు టార్గెట్
- వరుస చోరీలతో హడలెత్తిస్తున్న వైనం
- సీసీ కెమెరాల్లో రికార్డవుతున్నా దర్జాగా ఎస్కేప్
- కళ్యాణదుర్గం పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

కళ్యాణదుర్గం: దొంగలు పేట్రేగిపోతున్నారు. రెక్కీ నిర్వహించి మరీ చాకచక్యంగా ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఆలయాలను సైతం వదలడం లేదు. పక్కా పథకం ప్రకారం చోరీలు చేస్తూ దర్జాగా తప్పించుకుపోతున్నారు. బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా.. సీసీ కెమెరాల్లో చోరీల దృశ్యాలు నిక్షిప్తమవుతున్నా దుండగులు మాత్రం దొరక్కుండా పోలీసులకు సవాల్ విసురుతున్నారు. రాత్రి వేళలే కాదు పట్టపగలు సైతం దొంగలు విరుచుకుపడుతున్నారు. ఇలా వరుస ఘటనలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కళ్యాణదుర్గం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే పరిస్థితి. ఇళ్లకు తాళం వేసి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

పక్కా సమాచారంతోనే రెక్కీ

పట్టపగలే చోరీలకు పాల్పడుతున్న దొంగలు.. గత కొన్ని రోజులుగా ఆయా ఇళ్లపై రెక్కీ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచి ఇంట్లో డబ్బు, బంగారు ఉందన్న సమాచారం తెలుసుకుని దొంగతనాలకు పాల్పడటంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఆయా ప్రాంతాలపై బాగా తెలిసిన వ్యక్తులే ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల ప్రాథమిక అంచనా.

దర్జాగా దొంగతనాలు

కళ్యాణదుర్గంతో పాటు పలు ప్రాంతాల్లో చోరీలు జరిగిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నా దొంగలు దర్జాగా తమ పని కానిచ్చేస్తున్నారు. వరుస చోరీలతో ఇటు కళ్యాణదుర్గం పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే జంకే పరిస్థితి ఏర్పడింది. వరుస చోరీలతో దొంగలు తమను పట్టుకోండి చూద్దాం అంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

పోలీసుల మధ్య సమన్వయలోపం

వరుస చోరీలతో ఇటీవల వార్తల్లోకెక్కుతున్న కళ్యాణదుర్గంలో పోలీసుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సివిల్, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, క్రైం బ్రాంచ్, బ్లూ కోట్స్ విభాగాల సిబ్బంది మధ్య సమన్వయం లోపంతోనే చోరీలు అధికమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. సమష్టిగా పనిచేసి నేరాల అదుపునకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చోరీల్లో మచ్చుకు కొన్ని..

- కళ్యాణదుర్గంలోని పార్వతి నగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రాజేంద్ర ఇంట్లో గత ఆగస్టు నెలలో పట్టపగలే చోరీ జరిగింది. తలుపులకు తాళం వేసి ఉపాధ్యాయులు విధులకు వెళ్లిన సమయంలో దొంగలు చొరబడి 22 తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు.
- ఇదే కాలనీలో నివాసముంటున్న మరో ఉపాధ్యాయుడు భాస్కర్ ఇంట్లోకి చొరబడేందుకు దొంగలు ఇనుప రాడ్లతో తలుపులను పగులగొట్టేందుకు యత్నించారు. అయితే చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేయడంతో తలుపులకు రంధ్రం చేసి అక్కడి నుండి పరారయ్యారు.
- జూలై 27న కంబదూరు మండలం తిమ్మాపురంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దొంగలు హుండీ పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 1న కళ్యాణదుర్గంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బంగారు తాకట్టు పెట్టేందుకు ఓ మహిళ క్యూలో నిల్చుని ఉండగా బురఖా ధరించిన ఆరుగురు మహిళలు చుట్టూ చేరి.. ఆమె పట్టుకున్న బంగారు నగల బ్యాగును కత్తిరించేందుకు యత్నించారు. అయితే మహిళ గట్టిగా కేకలు వేయడంతో బురఖా ధరించిన మహిళలు పరారయ్యారు.
- సెప్టెంబర్ 7న కుందుర్పి మండలం కరిగానిపల్లి శశిమాకులమ్మ ఆలయంలో మూడు తులాల బంగారు ఆభరణాలు, మాంగళ్యం గొలుసు, ఆరు తులాల వెండి నగలను దొంగలు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 9న కుందుర్పి మండలం యర్రగుంట మారెమ్మ ఆలయంలో ఐదు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 13న కళ్యాణదుర్గంలోని కోటవీధిలో ఉన్న ఈరన్నస్వామి ఆలయంలో హుండీ పగులగొట్టి నగదుతో పాటు స్వామి వారి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- సెప్టెంబర్ 30న కంబదూరు మండలం రాంపురం, కొత్తూరు, వైసీ పల్లి, అండేపల్లి, కొత్తమిద్దెల గ్రామాల్లోని పలు ఆలయాల్లో బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీలలో నగదు చోరీ అయినట్లు ఆయా గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.




కళ్యాణదుర్గంలోని పార్వతి నగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు (ఫైల్)

కూటమి ప్రభుత్వ పతనం ప్రారంభమైంది

- సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి


ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: హామీలు గాలికొదిలేసి, అభివృద్ధి, సంక్షేమాన్ని అటకెక్కించి రెడ్‌బుక్‌తో అరాచక పాలన సాగిస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందని వైఎస్సార్‌సీపీ నియోజకర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని 25, 26 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, 25వ వార్డు ఇన్‌చార్జ్ గోల్డ్ ఇస్మాయిల్, 26వ వార్డు కౌన్సిలర్ ఆఫ్గాన్ ఫక్రుద్దీన్, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ అరకొరగా అమలు చేసిన సూపర్ సిక్స్ హామీలను పక్కన పెడితే కీలకమైన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్‌తోపాటు మేనిఫెస్టోలో ఇచ్చిన మరో 143 హామీలపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజలు అనేక సమస్యలను తమ దృష్టికి తెస్తున్నారని, అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందక కన్నీళ్లు పెట్టుకుంటున్నట్లు తెలిపారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారన్నారు. రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేసిన అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు.

ముస్లింలకు 'చంద్రబాబు' వెన్నుపోటు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచిందని మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో మసీదు నిర్వహణకు రూ.5 వేలు ఇస్తామని, ఖబరస్తాన్, ఈద్గాలు నిర్మిస్తామని, విజయవాడలో హజ్ హౌస్‌కు స్థలం కేటాయిస్తామని, దుల్హన్ పథకం కింద రూ.లక్ష ఇస్తామని ఇలా ఎన్నో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి తర్వాత వాటి ఊసేలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు రాజకీయంగా గాని, అభివృద్ధి, సంక్షేమంలోగాని సముచితస్థానం కల్పించారని గుర్తుచేశారు. కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, కోఆప్షన్‌సభ్యులు శ్రీనివాసులు, నజీర్, మాజీ కౌన్సిలర్ రఘురాం, వార్డు ఇన్‌చార్జ్‌లు గోనబావి నిజాముద్దీన్, తాశ బషీర్ అహ్మద్, రామాంజనేయులు, గంగాధర్, ప్రచార కార్యదర్శి తిప్పేస్వామి, జిలాన్, గౌస్, జలందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్, అల్తాఫ్, కొలిమి ఆనంద్, బడిగి బషీర్, మల్లికార్జున, ఉమాపతి, పైతోట రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన ఘనత బాబుదే



గోపులాపురంలో ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కణేకల్లు: ఎన్నికల సమయంలో అలవిగానీ హామీలిచ్చి అన్నీవర్గాల ప్రజలను మోసగించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఉషారాణి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మారెంపల్లి మారెన్న ధ్వజమెత్తారు. గోపులాపురం గ్రామంలో శనివారం 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచు సూర్యదేవర ప్రకాష్‌చౌదరి, వైస్ సర్పంచు గోపాల్, స్థానిక నేతలు కృష్ణారెడ్డి, కిష్టప్ప, నగేష్‌తో కలిసి నాయకులు వివిధ కాలనీల్లో పర్యటించారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ చదివి ప్రజలకు విన్పించారు. ఈ పథకాలన్నీ మీకు అందుతున్నాయా? అని ప్రశ్నించగా... 60 ఏళ్లున్న తమకు పింఛన్ ఇవ్వడం లేదని వృద్ధులు, 18 ఏళ్లున్న తమకు ప్రతి నెలా రూ.1500 ఇవ్వడం లేదని మహిళలు, చదువుకున్న తమకు నిరుద్యోగభృతి ఇవ్వడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం, బొమ్మనహాళ్ ప్రాంతాలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా వర్తించడం లేదని టిక్కెట్ ఇచ్చి ప్రయాణం చేస్తున్నామని మహిళలు నాయకుల దృష్టికి తెచ్చారు. వైస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, అనుబంధ సంఘాల నాయకులు ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, పూలచెర్ల సురేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీశైల, మల్లికార్జున, తిప్పేస్వామి, చంద్ర, ముక్కన్న, రుద్రన్న, బోయ నాగరాజు, రవి, హంపీ, పాటిల్ గోవర్ధన్‌రెడ్డి, కె.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అడిగితే కేసు పెడతానంటున్నాడు

వజ్రకరూరు: సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చు పెట్టిన వివరాలను అడిగినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానంటూ గ్రామ కార్యదర్శి మల్లయ్య బెదిరించినట్లు వార్డు సభ్యుడు మల్లికార్జునరెడ్డి శనివారం మీడియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన మాట్లాడుతూ వజ్రకరూరు పంచాయతీలో 2021 నుంచి 2025 జూన్ వరకూ ఫైనాన్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, సంబంధించిన ఫొటోల పరిశీలనకు అనుమతి ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా కోరానన్నారు. గడువులోపు సమాచారం ఇవ్వకపోవడంతో ఎంపీడీఓకు మొదటి అప్పీలు చేసుకోగా, స్పందించిన గ్రామ కార్యదర్శి మల్లయ్య స్పీడ్ పోస్టు ద్వారా సమాచారం పంపారన్నాడు. అయితే సమాచారం సమగ్రంగా లేదని మరోమారు ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లగా గ్రామ కార్యదర్శిని కలిస్తే పూర్తి సమాచారం ఇప్పిస్తానని ఎంపీడీఓ సూచించారన్నాడు. ఎంపీడీఓ సూచనల మేరకు గ్రామ కార్యదర్శిని కలవగా వార్డు సభ్యుడు అన్న గౌరవం లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరించారన్నాడు. తనకు ఏ హాని జరిగినా.. అందుకు గ్రామ కార్యదర్శే బాధ్యుడని, అతడి నుంచి రక్షణ కల్పించాలన్నాడు.

ఫ్యాప్టో పోరుబాట విజయవంతం చేయండి


వెంకటాద్రిపల్లిలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాసనాయక్

బెళుగుప్ప: ఉద్యోగ, ఉపాధ్యాయుల అక్టోబర్ 7న విజయవాడలో నిర్వహించే ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ శ్రీనివాస్ నాయక్ కోరారు. శనివారం బెళుగుప్ప, వెంకటాద్రిపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలసి చలో విజయవాడ -ఫ్యాప్టో పోరుబాట పోస్టర్లను విడుదల చేసారు. వారు మాట్లాడుతూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో)ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాటకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పద్ధతిలో పింఛన్ అందివ్వాలని, పెండింగ్ డీఏలు, బకాయిలు, 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాన్న డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరుబాట చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు చెక్కె తిప్పేస్వామి, నరేష్, అర్జున్, శ్రీనివాస మూర్తి, వెంకటసురేష్, సూర్యనారాయణ, వేణుగోపాల్, బి.తిప్పేస్వామి, వేణుగోపాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

కుందుర్పి: మండల కేంద్రంలోని మాన్యం భూములను శనివారం ఎండోమెంట్ అధికారులు పరిశీలించారు. వీరభద్రస్వామి మాన్యం భూమిని ఇటీవల కొందరు ఆక్రమించడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన దేవదాయ శాఖ జిల్లా అధికారులు శనివారం తహసీల్దార్ ఓబులేసు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ఆక్రమణకు గురైన ఆలయ భూములను పరిశీలించారు. ఆక్రమణదారులు వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు

కూడేరు: 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపు కోసం శనివారం జల్లిపల్లి, చోళసముద్రం, తిమ్మాపురం పంచాయతీల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. పూడికతీత, ఫారంపాండ్ల పనులకు ప్రాధాన్యత ఇస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ పోలేరయ్య, ఇంజినీర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు భగసింగ్ కాలనీలో వెలసిన శనీశ్వరస్వామి శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కుందుర్పి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ మాధవి, ఎంపీపీ కమల పేర్కొన్నారు. శనివారం సర్పంచ్ మారుతేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అధికారుల ప్రమేయం లేకుండా గ్రామాల్లో స్వచ్ఛందంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణతో వాహనదారుల ఇక్కట్లు


గొడిశెలపల్లి రోడ్డులో ఇరుక్కుపోయిన వాహనం

కణేకల్లు: జక్కలవడికి–గొడిశెలపల్లి మెయిన్‌రోడ్డు ఇరువైపులా ఆక్రమణకు గురై ఇరుకుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రోడ్డు చాలా విశాలంగా ఉండేది. బస్సులు, లారీ రాకపోకలు సాఫీగా సాగేవి. ఐతే కొందరు రైతులు రోడ్డును ఆక్రమిస్తూ పొలాలను విస్తరించుకుంటుండంతో రోడ్డు ఇరుకుగా మారిపోయింది. దీంతో లారీలు, కార్లు, జీపులు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. శనివారం తాజాగా టమాటతో వెళుతున్న ఐచర్ వాహనం మట్టిలో ఇరుక్కోపోయింది. దీంతో ఐచర్ యజమానితోపాటు రైతు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ రహదారిని సర్వే చేసి విస్తరించేలా చూడాలని గతంలో తహసీల్దార్‌కు వినతిపత్రాలిచ్చినా పట్టించుకొన్నపాపనలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయితీరాజ్‌శాఖ, రెవెన్యూశాఖ అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

షెడ్డుకు చేరిన 108 వాహనం


మెకానిక్ షెడ్డు వద్ద ఉన్న 108 వాహనం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్ నిర్వహణా లోపంతో మూలకు చేరింది. ఐదు రోజుల నుంచి వాహన సేవలు నిలిచాయి. వాహనాన్ని సిబ్బంది అనంతపురం రహదారిలోని రైల్వే బ్రిడ్జి పక్కన మెకానిక్ షెడ్డు వద్ద ఉంచారు. ఈ విషయమై సిబ్బందిని విచారించగా వాహనం మరమ్మతుకు గురైందని, ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. కాగా క్షేత్రస్థాయిలో అధికారులు స్పందించి వాహనాన్ని మరమ్మతు చేయించి త్వరగా అందుబాటులోకి తేవాల్సి ఉన్నా ఆ దిశగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ కారణంగా అత్యవసర కేసుల్లో రోగులు ఏరియా ఆస్పత్రి నుంచి అనంతపురానికి ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయించి నష్టపోవాల్సివస్తోంది. అంతేకాక అత్యవసర కేసుల్లో ఇతర మండలాల్లోని 108 వాహనాలపై ఆధారపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రాయదుర్గంటౌన్: గుమ్మఘట్ట మండలం టీ.వీరాపురం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం గుండిగానపల్లి గ్రామానికి చెందిన అన్నా, చెల్లెల్లు రమేష్, పల్లవి, ఐశ్వర్య బైక్‌పై పని నిమిత్తం రాయదుర్గంకు బయలుదేరారు. టీ.వీరాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో రమేష్, పల్లవి, ఐశ్వర్య కాళ్లు, చేతులకు రక్త గాయాలయ్యాయి. వీరిని ఢీకొన్న ద్విచక్రవాహనదారుడు అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రులు స్థానిక ఏరియా ఆస్పత్రి చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి కలశ నిమజ్జన పూజలు


దుర్గాదేవి కలశాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి కలశానికి నిత్యపూజలు చేసిన భక్తులు శనివారం నిమజ్జన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేస్తూ అమ్మవారి కలశాన్ని మోస్తూ గ్రామోత్సవంతో స్థానిక మంగోటి చెరువులో కలశ నిమజ్జనం పూజలతో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు


అలంకరణలో అంజన్న మూలవిరాట్

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు అనీల్‌కు మార్‌చార్యులు స్వామిని అభిషేకాలు, అర్చనల అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వారపు సంత వేలం


సంత వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్ గ్రామంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతలో సుంకం వసూలుకు శనివారం డిప్యూటీ ఎంపీడీఓ దాస్ ఆధ్వర్యంలోఅ వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన హెచ్. రామాంజినేయులు రూ.80 వేలకు వేలం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ మాట్లాడుతూ వేలం పాట ద్వారా సమకూరిన నిధులతో గ్రామంలో వీధిలైట్లు, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. బొమ్మనహాళ్‌లో జరగాల్సిన సంత వేలంపాట వాయిదా పడింద, వేలంపాట నిర్వహించే రోజును త్వరలోనే తెలియజేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శివన్న, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన బోధన

వజ్రకరూరు: ప్రభుత్వ బడుల్లో పిల్లలకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తామని హెచ్‌ఎం వెంకటేశులు, ఉపాధ్యాయుడు రాజేష్ అన్నారు. శనివారం మండలంలోని చాబాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడం, పిల్లల విద్యాస్థాయి గురించి తెలుసుకునేందుకు శనివారం సాయంత్రం వారు ఎస్సీ కాలనీలో విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని, విద్యార్థుల చదువుపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని వారు సూచించారు. ఉపాధ్యాయులు శ్రీధర్, దేవేంద్ర, రాము పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాములు

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జయరాములు సూచించారు. మండలంలోని పూలకుంట గ్రామంలో శనివారం జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకులను కొనుగోలు చేసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రూ.200కు పైబడి కొనుగోలు చేసిన వస్తువులకు జీఎస్టీ బిల్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.